

# చావుదేవర

రమాసుందరి బత్తుల

కొన్ని కథలు బతుకు పై పొరల్లో తచ్చాడి తేలిపోతూ ఉంటాయి. రాయటానికి, చదవటానికి అగచాట్లు పెట్టకుండా సాఫీగా తెల్లారిపోతాయి. కొన్ని జీవితాలు నాగు బాములాగా పట్టుకోవటానికి వల్ల కాకుండా ఎదురు తిరుగుతాయి. తల పట్టుకొంటే తోకతో చుట్టేస్తాయి. తోక పట్టుకొంటే పడగవిప్పి బుసలు కొడతాయి. వొడుపు చేసి పట్టకపోతే కాటేసిపోతాయి మరి.

నా పాతికేళ్ల వయసులో ముగిసిన ఈ కథ (జీవితం?) ఇప్పటికి మిడిసిపాటు తగ్గి నా చేతికి దొరికింది. అయినా దాని పొగరు చావలేదు. నేను ఆదెమ్మను కథానాయకురాలిగా చేద్దామని కథ మొదలుపెడితే ఆమె మాధవిని కథానాయకురాలిని చేసి కూర్చుంది.

నాకు పన్నెండో ఏట ఒక చిత్రమైన భయం పరిచయమయింది. మా ఒంగోలు శర్మా కాలేజీ ఆటస్థలంలో పెద్ద ఊడలు దిగిన మర్రిచెట్టు జుట్టు విరబోసుకొన్నట్లు ఉండేది. ఒక సాయంకాలం నేను మా అక్కకి తోడుగా అక్కడికి నడకకు వెళ్లాను. ఆ రాత్రే నన్ను భయ పెట్టే ఒక కల వచ్చింది. ఆ కలలో నేను ఒంటరిగా ఆ చెట్టు కింద ఉన్నాను. ఒక నవ్వు ఒళ్లు జలదరించేటట్లు వినిపించింది. విషాదం, ద్వేషం, కసి కలగలిసి హేళనతో కూడిన ఆ నవ్వు గుండెల్ని పిండేసింది. అది ఆడగొంతో మగగొంతో తెలియలేదు. నేను భయపడి పరుగులు పెట్టాను. ఎంత దూరం పరిగెత్తినా ఆ నవ్వు నా వెనుకనే వస్తోంది. ఇంతలో ఒక తెల్లటి బలిసిన ఎద్దు... పన్నెండడుగుల ఎత్తుంది. మూరెత్తు మోపురం... ముడతలు పడ్డ గంగడోలు మెత్తటి దూదిలాగా దాని మోకాళ్లదాక ఊగుతోంది. దాని కనుగుడ్లల్లో కందామన్నా కనికరంలేదు. రంకెలు వేస్తూ నామీదకు వచ్చింది. కాటుక పెట్టుకొన్నట్లు ఉన్న దాని కళ్లు క్రూరంగా చూస్తున్నాయి నా వైపు. వళ్లంతా చెమటలతో మేల్కొన్న నన్ను మా అమ్మ దగ్గరకు తీసుకొని, 'సమాధుల దగ్గరకు షికారుకెందుకెళ్లారు? పిల్ల భయపడింది,' అని అక్కని మందలించింది. ఇది జరిగాక ఏడాదికి ఆదెమ్మ యలమంద తాతతో ఓ సాయంకాలం మా ఇంటికి వచ్చింది.

ఆదెమ్మ మా తాత కూతురు. వరసకు చిన్నాన్న అయ్యే యలమంద తాత అంటే మా అమ్మకు భలే ఆపేక్ష. మా అసలు తాత చిన్నప్పుడే చచ్చిపోతే యలమంద తాతే అమ్మను సాకేడట. ఊరు వదిలి చదువుకోవటానికి ఒంగోలు వచ్చిన మా అమ్మ మంచి చెబ్బర తాతే చూసేవాడట. మా అక్క పెళ్లినాటికి కూడా మా అమ్మను తీసుకెళ్లి తద్దెనోము తీర్చాడు. పండగలకు పబ్బాలకు ఆడపిల్లకు జరిపించాల్సిన సాంగేలు అన్నీ ఆయనే మా అమ్మకు జరిపేవాడు. అట్లా అని ఆయన వందెకరాల ఆసామి అనుకొనేరు. ఎడ్లబండి స్వంతదారు. తెల్లటి బుర్రమీసాలతో మట్టసమైన ఎత్తుతో పులిలాగా నడిచేవాడు మా తాత. ఎండ్రుకలు వెనక్కి దువ్వి ముడి వేసేవాడు. తెల్లారి కట్లే లేచి ఎడ్లబండి కట్టి కరవాది నుండి వడ్లు, కందులు, పెసలు ఒంగోలు మార్కెట్‌కి చేర్చేవాడు. అప్పట్లో పాత శ్యామ్‌ప్రసాద్ హాలుకాడ బండ్లు ఆపి ఎద్దలకి మేత వేసేవాళ్లు. ఆయనకు ఆదెమ్మ మూడో ఆడపిల్ల.

ఆదెమ్మది యలమంద తాతలాగే మట్టసమైన ఎత్తు. నీరుపట్టిన పాలరాయి రంగు వళ్లు. సున్నిపిండి,

పసుపుతో రుద్ది సుద్దంగా స్నానం చేసేది. రంగులద్దిన నైలాన్ చీరలు కట్టేది. నవ్వితే గోధుమరంగు పెదాలు విచ్చుకొని గులాబీరంగు చిగుర్ల మధ్యన తెల్లటి పళ్లు మెరిసేవి. గోలీకాయల్లో కనబడే ఆకుపచ్చరంగు కళ్లు తనవి. ఆ కళ్లల్లో ఒక్కోసారి ఆపాలనుకొన్నా దూకి వచ్చే నవ్వులో, ఆమె ఎవరికి తెలియకుండా భద్రంగా తాళం వేసుకొని దాచుకొన్న ఆశలు నాకు కనపడేవి. సిగ్గుపడి చెంపలు ఎరుపెక్కటం, కళ్లతోబాటు వంట్లో కూడా ఊసులు సుడులు తిరగటం నేను ఆదెమ్మ దగ్గరే మొదటిసారి చూశాను. మా అక్క ఆదెమ్మ వయసుదే అయినా ఎప్పుడు చదువు గోలలో ఉండేది. మెడిసిన్ సీట్ తప్ప ఇహలోకంలో ఆమెకు ఏవీ పట్టేవికాదు. ఆదెమ్మ సావాసం నాతోనే. ఆరుబయట నా నులక మంచమే ఇద్దరం పంచుకొనేవాళ్లం.

"అల్లూరు ఆకుతోటల్లో అత్తెసరు అన్నం వండుకొని, లేత అరటికాయలు అప్పటికప్పుడు కోసి నూనె లేకుండా కూరొండుకొని తింటే రావుడూ..." అని నోరూరించేది. "పొలాల్లో దొంగతనం చేసిన పండని దోసకాయల్ని ఎప్పుడైనా తిన్నావా? ఆ రుచే యేరు."

నేనింకా ఏమేమి కోల్పోయానో అని దిగులు పడుతుంటే, "కోవటోల్ల వరాలు మంచిదికాదు," అని వున్నట్లుండి తీర్మానించేది. "మా ఊరు ఆరెంపి డాట్టర్ని చూసి ఎప్పుడూ నవ్విద్ది," అని ముఖం చిట్లిచ్చేది.

ఆదెమ్మకు సినిమాపిచ్చి ఎక్కువ. కొత్త సినిమా వస్తే, "అమ్మనడుగు సినిమాకు పోదాం," అని నన్ను ముందుకు తోసేది. ఆమెకు కమల్‌హాసన్ అంటే ఇష్టం. ఒంగోలు సిటీబస్లో తన వెంటబడే వాళ్ల ఊరి టైలర్ గురించి నాకు రహస్యంగా చెప్పింది. ఒకసారి దూరం నుండి చూయించింది కూడా. గళ్లచొక్కా, బెల్‌బాటమ్ పాంటూ, ఉంగరాల జుట్టూ... కాస్త కమల్‌హాసన్‌లాగే ఉన్నాడు.

*

పొద్దున్నే నిద్రలేచి కళ్లు నులుముకొంటూ ఆదెమ్మ కోసం చూశాను. అప్పటికే పేడకళ్లాపు చల్లి, నీళ్లకాగు పొయ్యిమీద పెట్టి రెండు కాళ్లు ముడిచి మొకానికి లాక్కొని చెర్లో తామర తూడులాగ కూర్చొని ఉంది. ముఖం వాడిపోయి ఉంది.

"ఏమయింది?"

"కనకాయి పెళ్లికి పోవాలంట నేను." కనకాయి ఆదెమ్మ చెల్లెలు.

"వెళ్లూ," దానికంత దిగులెందుకు అన్నట్లు చూశాను.

"అవునూ. ముందు నీ పెళ్లి కదా అవ్వాలి?" అడిగాను.

"నా పెళ్లి అయిపోయింది కదా" ఎటో చూస్తూ చెప్పింది.

"ఎప్పుడు?"

"నాకప్పుడు పద్నాలుగు ఏళ్లు."

"అంత చిన్నపుడా? వద్దని ఏడవలా?"

"నాకంటే ముందే ఇంటో అందరు ఏడుస్తున్నారు."

"ఎందుకు?"

"అన్నాయి చచ్చిపోయాడు కదా."

యలమంద తాత పెద్ద కొడుకు పురుగు మందు తాగి చచ్చిపోయాడని అమ్మ, అవ్వ అనుకొంటుంటే విన్నాను.

"అన్నాయి ఎందుకు చచ్చిపోయాడు ఆదెమ్మా?" అడిగాను.

"తెలియదు రావుడూ. అప్పుడు ఇంటో తగాదాలు జరిగేవి. నా కర్థం అయ్యేవి కావు. అన్నాయి మాదిగ ఓబేసు కూతురుతో తోపుల్లో కనబడ్డాడని బాబు ఆరోజు అన్నంకాడ అమ్మతో అంటుంటే విన్నాను. ఆ రాత్రి అన్నాయ్ కోపంగా అన్నంలో నీళ్లు పోసి లేసి పోయాడు. తరువాత బాబు, అన్నాయి ఏదో అరుసుకొన్నారు," గొంతు తగ్గించి చెప్పింది.

"అన్నాయి చనిపొయ్యాక చావుదిబ్బలదాకా కూడా బాబు పోలా. ఒక్కనాటికే మనిషి పీల్చకపోయాడు. నాకు దబ్బున లగ్గం చేయాలని పట్టు పట్టాడు. బయట నుండి రాగానే, 'అమ్మాయ్ ఆదెమ్మా,' అంటే పరిగెత్తుకెళ్లి మంచినీళ్లు ఇచ్చేదాన్ని. ఎండ్రుకలకు ఆముదం రాసి వెనుక ముడి నేనే పెట్టేదాన్ని. నా కంట్లో కుంకుడు పులుసు పడితే ఉఫ్ ఉఫ్ అని ఊపిరిపోయే దాకా ఊదే బాబు, నేను కూడు మానేసి పెళ్లి వద్దని కుళ్లి కుళ్లి ఏడ్చినా వినలా. అన్నాయి చనిపోయిన నెల తిరగకుండానే నా లగ్గం ఊళ్లోనే అయిపోయింది," ఆదెమ్మ చెప్పుకుపోతోంది.

నేను భయంతో సన్నగా వణుకుతున్నాను. ఆదెమ్మ నన్ను గమనించలేదు. సన్నని ఏడుపు నా చెవుల్లో మొదలయ్యి పెద్దదయ్యేకొద్దీ నవ్వుగా మారింది. కలలో ఎద్దు రంకె వేస్తూ కాలితో దువ్వుతోంది. కళ్లు యిప్పార్చి గుటక మింగాను.

"మరి అమ్మమ్మ ఏమి అనలేదా?" గొంతు పెగుల్చుకొని అడిగాను.

"చేసుకోకపోతే ఇంటో నుండి పొమ్మంది."

"పెళ్లికొడుకు ఎవరు?"

ఆదెమ్మ ముఖం మరింత మసక బారింది.

"బారియ చచ్చిపోయిన వెంకన్న. నా కంటే ఇర్వై ఏళ్లు పెద్ద. మొదటి నిద్రకే పారిపోయి వచ్చా. ఇక పోలె."

"తాత, అమ్మమ్మ ఏమన్లా?"

"కొట్టారు. చస్తామని బెదిరించారు. అయినా నే పోలా."

"ఇక పోవా?"

ఆదెమ్మ ఆశ్చర్యంగా చూసింది. "ఒగదెంచు కొన్నాంగా? నీకు తెలియదా? ఓనాడు సందకాడ నేను ఏటికాడికి నీళ్లకెళ్లి వస్తుంటే, నా కడ్డం వచ్చాడు. తాగి తూలతన్నాడు. తప్పుకొని పోబోతుంటే నా చేతిలో బుంగ లాగేసి బూతులు తిడతా నా పైట బట్టి లాగి, కోక వూడ పెరికాడు."

"అమ్మో!" నోటి మీద చెయ్యేసుకొన్నాను.

"మరి ఎలా వచ్చావు ఇంటికి?"

ఆదెమ్మ చెప్పలా. తూర్పున పొడుస్తున్న ఎఱ్ఱటి తట్టను చూస్తూ కూర్చుంది. అందులో ఆమెకు ఏటి వడ్డు నుండి, ఇంటిదాకా వంటి మీద వట్టి లంగా జాకెట్టుతో... కుంగిపోతూ... భీతావహంగా పరుగులు పెడుతూ ఎక్కిళ్లుపెట్టి ఏడుస్తున్న పదిహేడేళ్ల పడుచుపిల్ల కనబడి ఉండాలి.

"కులపోళ్లు కూచొని ఒగతెంచారు. నేను రెండేళ్లు ఇంట్లో నుండి బయటకురాలా. కనకాయి పెళ్లి చేయాలని బాబు నన్ను ఈడకు పంపాడు. కనకాయికి అయిన సంబందరమే కుదిర్చారు. మా మేనత్త కొడుకే. బాగుంటాడు. అన్నాయి చచ్చిపోకపోతే నాకూ బాబు మంచి సంబందరమే తెచ్చేవాడు," దిగులుగా అంది. నా చెవుల్లో హోరు వినబడకుండా చెవులు గట్టిగా మూసుకొన్నాను.

'రాత్రికి ఎద్దు కలలోకి రాకపోతే బావుండు.'

*

ఆదెమ్మ మా ఇంట్లోనే ఉండి కుట్టుమిషన్ నేర్చుకొంటోంది. నేను ఆదెమ్మ సావాసంతో చదువు మీద శ్రద్ధ పెట్టటం లేదని అక్క నుండి చాడీలు వెళుతున్నాయి. ఎప్పుడూ లేనిది అమ్మ నా చదువు మీద నిఘా పెట్టింది. జనరంజని ఎక్కువ వింటున్నానని, రేడియో బాటరీలు కొనటం మానేసింది. సినిమాలకు అనుమతులు దొరకటం లేదు. నాకిక చదవక తప్పలా. పది పరీక్షలు దగ్గర పడేకొద్దీ ఆదెమ్మ నాతో రాత్రిళ్లు మేల్కొని వుండేది. పరీక్షల ముందు నా హడావుడి చూసి అన్నం ముద్దలు కలిపి నోట్లో పెట్టేది. చవురు రాసి నా జుట్టు నున్నగా దువ్వి రెండు జడలు గట్టిగా బిగించి పైకి కట్టేది. చదువుతో వేడెక్కి ఉన్న నా తలకాయ ఆదెమ్మ దువ్వుతుంటే హాయిగా ఉండేది.

నేను ఇంటర్‌కి వచ్చాను. నా లోకం ట్యూషన్లు, మార్కులు, కొత్త స్నేహాలూ... ఆదెమ్మతో ఒంటరి మాటలు తగ్గాయి. ఈమధ్య ఆమె దిగులుగా వుంటోంది. అమ్మ, తాత ఆదెమ్మకు మారు మనువు గురించి మాటలు జరుపుతున్నారు. మళ్లీ రెండో పెళ్లి సంబంధమే. ముందు సంబంధానికి ఒక కొడుకు కూడా ఉన్నాడట.

"నీకిష్టమేనా?" అడిగాను.

"తప్పదుకదా. ఎన్ని రోజులు ఉంటాను ఈడ?" ఈమధ్య నాయనమ్మ ఇక్కడే ఉంటుంది. ఆదెమ్మ మీద విసుర్లు ఎక్కువయ్యాయి.

"మరి కమల్‌హాసనూ?"

దిగాలుగా నవ్వింది. "బాబు ఒప్పుకోడు. మన కులం కాదు, వాళ్లు దూదేకులోళ్లు."

ఆదెమ్మ పెళ్లి బొప్పాడ గుళ్లో జరిగింది. ఏటవాలుగా ఉన్న బొప్పాడ కొండ ఎక్కటానికి భయపడుతున్న పెళ్లికొడుక్కి కళ్లకు గంతలు కట్టి తీసుకొని వెళుతుంటే ఆదెమ్మ నావైపు చూసి నవ్వింది. ఏదీ దాయలేని ఆ ఆకుపచ్చని కళ్లల్లో సైగ్గా కదిలిన మబ్బు నా చూపును దాటలేకపోయింది.

*

ఆదెమ్మ బాగానే అమరిపోయింది కాపురంలో. ఒక దెబ్బ కొట్టకుండ పిల్లాడ్ని పెంచింది. సాధించి చట్టిలో పెట్టాలనుకొన్న అత్త, ఆడబిడ్డలతో సావాసం చేసేసింది. ఆదెమ్మ వాళ్ల ఆయన కూడా మంచోడే. మెత్తనోడు కాకపోతే.

చిలకలూరిపేట నుండి సిటీబస్ ఎక్కి వెళ్లాలి వాళ్ల ఊరికి. ఊరు పచ్చగా ఉంది. పెద్దపెద్ద మండువాల పాత పెంకుటిళ్లు. గొడ్లు, గోద... కొన్ని పశువుల కొస్టాలకు కూడా సీమ పెంకు కప్పారు. ఊళ్లోకి నడుస్తుంటే ఒక ఎద్దు తల ఊపుతూ నడుచుకొంటూ నా ఎదురు వచ్చింది. నేను భయంగా పక్కకు తప్పుకొన్నాను. ఈ ఎద్దు... ఎక్కడ చూశాను?

"అది మన ఒంగోలు ఎద్దేలే. మన దార్న మనం పోతుంటే మనల్ని ఏమి చేయదు," ఆదెమ్మ నవ్వుతూ ఎదురొచ్చింది.

"దానికి ఎదురెళితే?" చిన్నగా అడిగాను. ఆదెమ్మ వినలేదు. తన కళ్లల్లో ఇదివరకటి ఆశలు లేవు. అలసట,

దానిని మించిన శాంతి కనిపిస్తున్నాయి. ఒక్క అరగంట లోనే నాకు ఆ ఇంటి సంగతి అర్థం అయ్యింది. ఆదెమ్మ మిషన్ కుట్టి ఇంటిని నడుపుతోంది. ఇంట్లో మిగతా వాళ్లకెవరికి స్థిరమైన ఆదాయం లేదు. అయితే వాళ్లం దరిలో ఆమెపట్ల గౌరవం కనిపిస్తోంది.

సాయంకాలం గుడికని వంక పెట్టి బయటకు తీసుకొని వెళ్లింది. అప్పుడే చూశాను ఆ ఇంటిని. ఒక వీధి నుండి ఇంకొక వీధి దాకా విస్తరేసినట్లు ఉంది. బర్మా టేకుతో చేసిన ఇంటి తలుపు కొట్టొచ్చినట్లు కన బడుతోంది. దానిమీద రాధాకృష్ణులు అల్లుకొని ఉన్నారు.

"ఆ ఇల్లు ఎవరిది?" అడిగాను.

"పెద నరసయ్య గారిది."

"చిన నరసయ్య ఎవరు మరి?" అడిగాను.

ఆదెమ్మ మురిపంగా నవ్వింది. "నీ ప్రశ్నలు మాత్రం మారలేదు రావుడూ." ఆగి చెప్పింది. "పెద నరసయ్య బావమరిది చిన నరసయ్య. పక్క ఇల్లే. ఆయన చెల్లెల్ని చేసుకొన్నాడు. పెద నరసయ్యకు ఇద్దరు కొడుకులు. చిన నరసయ్యకు ఒకటే కూతురు. మాధవి. భలే ఉంటుంది. జుట్టు ఎంత వత్తు అంటే ఒక్క జడ వేస్తే అరచేతి మందాన వెడల్పు వచ్చేది. మోకాళ్ల కింద దాకా జడ. మాధవి నవ్వితే కళ్లూ బుగ్గలు రెండూ ఎలుగు తాయి. నడుస్తుంటే మన దొడ్లో గుమ్మడితీగ గాలికి కద లాడినట్లు ఉంటుంది."

"పెళ్లైయిందా?"

"మాధవికి పెద నరసయ్య చిన్న కొడుకు నరేష్‌తో చిన్నతనం నుండి మాలిమి. నేను వాళ్లింటికి జాకెట్లు ఇవ్వటానికి వెళ్లేదాన్ని. ఒకరోజు బావకు గోరింటాకు పెడుతోంది మాధవి. నాకు రెండు కళ్లు చాలలేదు వాళ్లిద్దర్ని అట్టా చూస్తే." ఆదెమ్మ కళ్లల్లో మెరుపు నా గమనిక నుండి తప్పుకోలేకపోయింది. నన్ను చూసి వెంటనే కళ్లు తిప్పుకొంది.

"మరి వాళ్లిద్దరికి పెళ్లైయిందా?" అడిగాను.

"అవలేదు," దిగులుగా అంది.

"పెదనరసయ్య పెద్దకొడుకు ఎంగటేశర్లు ఎగ సాయం చేస్తాడు. మాధవిని తను చేసుకొంటానని అన్నాడు."

"మాధవి ఏమంది?" ఆత్రంగా అడిగాను.

"పెళ్లంటూ చేసుకొంటే చినబావనే చేసుకొంటా నని పట్టుబట్టింది."

"అపుడూ?"

"పొలానికి వెళ్లిన ఎంకటేశర్లు ఏపచెట్టుకు ఉరేసు కోని చచ్చిపోయాడు."

"మాధవి అంటే అంత ఇష్టమా?" బలహీనంగా వచ్చింది నా గొంతు.

"అదేమీ కాదు. అగమానపడ్డాడు. మాధవి చేసు కోను అనేసరికి."

మళ్లీ నా చెవులో అదే నవ్వు మొదలైంది. ఈసారి నవ్వు ఇంకా భీతికొలిపే టట్లు... ఎకెసెక్కం చేస్తున్నట్లు... హెచ్చరిస్తున్నట్లు... ఇందాకటి ఎద్దు... ఎక్కడ చూశాను దాన్ని? సింధూ నాగరికత కుదురు చిహ్నాలలోనా? ఆర్యుల పశుగణాల్లోనా? ఈజిప్ట్ కోటల మీద మిగిలి ఉన్న లిపిలోనా? ఎక్కడ పుట్టి ఉంటుందది?

"రెండు కుటుంబరాలు అల్లాకొల్లమయ్యాయి. గుంటూర్లో చదువుతున్న నరేశు చానారోజులు ఊరి మొగం చూడలేదు. పెదనరసయ్య భార్య పిచ్చమ్మ మంచాన బడింది. చిన్నప్పటి నుండి తన చేతలతో సాకిన మాధవి మొగం చూడటానికే ఇష్టపడలేదు. మాధవి అత్త మంచం కాళ్లకట్ట కాడ కూర్చొని కంటికి మంటికి ఏకంగా ఏడవటం నేను చూశాను. అయినా పిచ్చమ్మ కరగలేదు. నెలరోజుల్లోనే మాధవికి వేరే సంబందరం చూసి పెళ్లి చేసేశారు. పెళ్లిలో మాధవి కళ్లు మన ఈతముక్కాలమ్మ కళ్లులాగా ఎర్రగా వున్నాయి. పెళ్లికూతురు కంటికి కలక వచ్చిందని చుట్టాలకి చెప్పు కొన్నారు," ఆదెమ్మ చెప్పుకుపోతోంది.

"అన్నాయి సావు నా బతుకును ఇటు తిప్పింది. ఎంగటేశర్లు సావు మాధవి బతుకును ఇంకోవైపు తిప్పింది," కొబ్బరిచిప్ప నేలకేసి కొడుతూ అంది.

"వీటికన్నిటికి కారణం చావులేనంటావా? కాదు. చావుదేవర ఎవరో ఉన్నారని అనిపిస్తుంది."

"ఏమిటి?" అంది ఆదెమ్మ అర్థంకాక.

"ఎద్దు." దూరంగా మేస్తూ కనబడింది. కంటి కొనకల్లోంచి నన్ను చూస్తున్నట్లు ఉంది.

"ఏమిటీ?" అర్థంకాక మళ్లీ అడిగింది ఆదెమ్మ.

"ఏమీలేదు. నువ్విప్పుడు బాగానే ఉన్నావు కదా."

"ఆ. 'సవతితల్లి సవతితల్లే,' అనే ఇరుగుపొరుగు మాటలు పడ్డాను. నా అడుగడుగు కళ్లతో పాటో తీసిన అత్త, ఆడబిడ్డ... పర్వాలేదు. అయితే రావుడూ... ఇంట్లో ఎవరూ లేనపుడు, 'నా ఈపు మీద ఏదో పారకాడుతుంది సూడు,' అని పిలిచిన మావను మాత్రం బరాయించలేక పోయాను. ఈయనకు చెప్పాను."

"ఏమన్నాడు మరి?"

"కొన్నాళ్లు జాగరత్తగా ఉండు, యేరు పోదామని అన్నాడు. ఆ కొన్నాళ్లు గడవక ముందే మావే పోయాడులే

పసికర్లతో. ఎవ్వరూ జాలి చూపని నా బతుక్కి దేవుడే జాలి చూపాడు,'' వెనక్కి తిరిగి మరోసారి గుడికి దండం పెట్టింది.

*

పెళ్లైయిన ఆరేళ్లకు ఆదెమ్మ నీళ్లు పోసుకొందని తెలిసింది. కాన్పుకి కరవాది వచ్చింది. అప్పుడు సెలవల్లో ఉన్నాను నేను. పిల్లాడ్ని చూడటానికి వెళ్లాను. తలకు గుడ్డ కట్టుకొని పిల్లాడి పక్కన పడుకొని ఉంది.

''నీ గోళి కళ్లు రాలేదు,'' పిల్లాడ్ని పరికించి చూస్తూ అన్నాను.

నవ్వింది.

''మీ ఊరు మాధవి బాగుందా?'' గుర్తుకు వచ్చి అడిగాను.

''మాధవికి ఇద్దరు పిల్లలు. నరేశుకి కూడా,'' దోమలు రాకుండా పిల్లాడ్ని విసురుతూ అంది.

''మాధవి కూడా నీలాగే బతుకు చూయించిన దార్నే నడిచిందిలే. ఎదురెళ్లలేదు.''

''ఈమధ్య వాళ్ల ఇళ్లల్లో తగాదాలు జరిగాయి,'' చెప్పింది.

''నరేశు పెద్ద ఆఫీసర్ కదా గుంటూర్లో. ఆయన బారియ మొన్న పండక్కి ఊరికొచ్చినపుడు మాధవి వాళ్ల అమ్మను నానా మాటలు అందట. నీ కూతురు మా ఆయనకు పద్దాక ఫోన్లు ఎందుకు చేస్తుంది అని కొట్టా డిందట. పెద్దోళ్ల ఇళ్లల్లో విషయాలు దాగవుగా. అయి నోళ్లు. పైగా చిన్నప్పటి నుండి ఒక దగ్గర పెరిగినోళ్లు. మాట్లాడుకొంటే తప్పేంటి? వాళ్లిద్దరూ ప్రేమించుకొన్న సంగతి నరేశు భార్యకు పెళ్లికి ముందే తెలుసు. అందు కని అనుమానమేమో,'' తనలో తను చెప్పుకొన్నట్లు చెబుతోంది.

''అయ్యుండచ్చు,'' ఆలోచిస్తూ అన్నాను.

''నరేశు భార్య ఎప్పుడూ చిటపటలాడతా వుంటది.''

''పెళ్లప్పుడు ఎలా ఉండింది?'' అడిగాను.

''అప్పుడు బాగానే ఉండేది. ఈ ఐదారేళ్ల నుండే ఇట్టా.''

*

''సువ్వీ కస్తూరి రంగా... సువ్వీ కావేటి రంగా... సువ్వీ రామాభిరామా సువ్వీ లాలి...'' టేప్‌రికార్డర్‌లో జానకి గొంతు తియ్యగా... నా గొంతులోకి జారుతున్న డికాషన్ కాఫీ కమ్మగా... ఈ పాటలు స్వేచ్ఛగా వినడానికి నాకు ఇన్నేళ్లు పట్టింది. చిన్నప్పుడు చదవటం లేదని జనరంజని విననివ్వని అమ్మ... తరువాత ఆదెమ్మ గుర్తుకు వచ్చారు. నాలుగేళ్లు అయ్యిందా తనను కలిసి?

ఆలోచిస్తూ పేపర్ తెరిచాను. ఆదెమ్మ వాళ్ల ఊరి పేరు కనబడింది. 'పెద్ద కర్మ' హెడ్డింగుతో పెట్టె కట్టి ఉంది. ''ప్రకాశం జిల్లా ఇంజనంపాడుకి చెందిన పెద నరసయ్యగారి చిన్నపుత్రుడు నరేశ్‌కుమార్...'' ఇక చదవ లేకపోయాను. పరుగున వెళ్లి ఆదెమ్మకు ఫోన్ చేశాను. అవతలి వైపు లాండ్‌లైన్ ఫోన్ ఎత్తలేదు.

*

''హైదరాబాద్ నుండి కారులో ఒక్కదానివే వచ్చావా? అంజప్ప అంటూనే ఉంది. ఉద్యోగం వచ్చాక నీకు బొత్తిగా భయం లేకుండా పోయిందని,'' కారు దగ్గరకు వచ్చింది ఆదెమ్మ.

కానీ నేను వచ్చిన కారణం ఆదెమ్మకు తెలుసు.

''నరేశ్...?'' మంచినీళ్ల గ్లాసు అందుకొంటూ ఆగ లేక అడిగాను.

''మాధవి విషయం తెలుసా?'' ఎదురుప్రశ్న వేసింది.

''మాధవికి ఏమయ్యింది?'' నా గుండె కొట్టుకో వటం నాకు వినిపించింది.

''మాధవి కూడా చచ్చిపోయింది.''

కళ్లప్పగించి చూస్తున్నాను. అదిగో అదే నవ్వు. పగలబడి వినిపిస్తుంది. ఈసారి మరింత పదునుగా, సూటిగా నా మొఖంలోకి మొఖం పెట్టి గారపళ్లతో గేలి చేస్తున్నట్లు... వెకిలిగా మొహం తిప్పుతున్నట్లు... భయం కంటే నన్ను సవాల్ చేస్తున్నట్లు... ఆ ఎద్దు? తల తిప్పి చూశాను. అది గేటు దగ్గర కనబడింది. నేను చూస్తున్న వైపు చూసింది ఆదెమ్మ.

''ఏంటా బిత్తరచూపు? అన్నం తిను ముందు. ఎండనపడి వచ్చావు,'' పోబోయింది.

''వద్దు. ముందు చెప్పు,'' చెయ్యి పట్టుకొని ఆపాను. నా చెయ్యి వణుకు నాకు తెలుస్తోంది.

ఆదెమ్మ నా మంచం పక్కనే నేలమీద కూల బడింది.

''నరేశు పెళ్లాం అప్పుడు గొడవ చేసిందని చెప్పా కదా. తరువాత ఒకరోజు ఏమయ్యిందో ఏమో మాధవి వాళ్ల ఆయనకు ఫోన్ చేసి చెప్పిందట, 'మీ ఆవిడను అదుపులో పెట్టుకో,' అని. ఆయన కాస్త మెతకమనిషి. మరెందుకో మాట్లాడలేదంట. 'చేతకాని చవట,' అని ఇక్కడకు వచ్చి చిన నరసయ్య ఇంటి ముందు తిట్టి వెళ్లింది.

"తరువాత?"

"ఒకరోజు ఆమే మాధవి వాళ్లాయనకు ఫోన్ చేసి, 'నీ పెళ్లాం రాజమండ్రిలో మా ఆయనతో లాడ్జిలో ఉంది. వెళ్లి తెచ్చుకో పో,' అని చెప్పిందట."

"ఆ మాట నిజమేనా?" ఆపి అడిగాను.

ఆదెమ్మ నింపాదిగా నా వైపు చూసింది.

"నిజమే."

తను ఊహించిన ఆశ్చర్యం నా కళ్లలో కనబడలేదేమో బహుశ, ఒక్కక్షణం ఆగి మళ్లీ మొదలుపెట్టింది.

"మాధవి వాళ్ల ఆయన వెళ్లి భార్యను తెచ్చుకొన్నాడు. నరేశు మామూలుగానే ఇంటికి వెళ్లాడు. ఒక నెల తరువాత ఒకరోజు పొద్దున్నే ఊర్లో గగ్గోలు. నేను పొయ్యిలో పొట్టు కూరుతున్నాను. పిల్లాడు ఇంకా లేవలేదు. చాకలి వెంకాయ్ పరిగెత్తుకొని వచ్చి చెప్పింది. ఊరి అడ్డరోడ్డు దగ్గర ఆగి ఉన్న కారులో నరేశు, మాధవి చనిపోయి ఉన్నారని. ఇక చూడు రావుడూ! ఊరు ఊరంతా వెళ్లి చూసింది. నేనూ వెళ్లాను. మాధవి నరేశు ఒడిలో పడుకొని నిద్రపోతున్నట్లే ఉంది. ఆమె బారెడు జడని నరేశు భుజం మీద వేసుకొని ఉన్నాడు. నరేశు భార్య ఊళ్లోనే ఉంది అపుడు. పెద నరసయ్య మంచాన ఉన్నాడు. చిన నరసయ్య నెత్తిమీద గుడ్డ వేసుకొని లేవలేదు. ఇగ ఊళ్లో పెద్ద మనుషులు తలుచుకొని మాధవి వాళ్లాయనకు కబురు చేశారు. అతను వచ్చేలోపు ఇద్దర్నీ విడదీసి విడిగా కూర్చోబెట్టారు. చానా కష్టమైంది అట్టా విడదీయటం," ఆదెమ్మ చెప్పుకుపోతోంది.

"తరవాత జరగాల్సినవి అన్నీ జరిగిపోయాయి. మాధవి కర్మాంతరాలు ఆమె అత్తారి ఊళ్లో జరిపారు. నరేశువి ఇక్కడే."

నేనేమీ మాట్లాడలేదు. గుండెని దబ్బకారుతో కుడుతున్న బాధ. గోడకు చేరి గలబడ్డ ఆదెమ్మ గోళీ కళ్లల్లో సన్నటి నీటిపొర.

"నీకో సంగతి తెలుసా?" ఉన్నట్లుండి మళ్లీ మాట్లాడింది. "నరేశు భార్య పసుపు, కుంకమ తీయనని చెప్పింది. ఎంతమంది చెప్పినా వినట్లేదు. కుటుంబరానికి అరిష్టం అని వాళ్ల అమ్మ మొత్తుకొన్నా ఒప్పుకోలేదు. ఊరంతా ఏడ్చారు.ఆమె కంట ఒక చుక్క నీళ్లు కారితే వట్టు."

నేను నిట్టూర్చి లేచాను, వెళతానని. నేనిక ఆగనని ఆదెమ్మకు తెలుసు.

"పెళ్లి గురించి ఏమి ఆలోచించావు? అప్పకి, బావకి నీ గురించి మనియాద," సాగనంపటానికి వస్తూ అడిగింది.

నేను మాట్లాడకుండా వడివడిగా నడిచాను. కారు అడ్డరోడ్డు పట్టింది. 'ఇక్కడేనా, కారు ఆపుకొని... ఎలా చచ్చిపోయారో అడగలేదే! ఒకరికొకరు పురుగు మందు తాపుకొని... లేక నిద్రమాత్రలు మింగి... ఎవరు ముందు చనిపోయి ఉంటారు?"

ఉన్నట్లుండి కారు ఆపాను. ఎద్దు... కదలకుండా ఎదురుగా నిల్చోని ఉంది. బుసలు కొడుతోంది. దాని కళ్లల్లో పశుత్వం... కాదు కాదు మృగత్వం... క్రూరత్వం... రాక్షసత్వం. కాలు దువ్వుతూ నామీదకు దూకటానికి సిద్ధంగా ఉంది. సన్నటి నవ్వు నా చెవుల్లో అలలు అలలుగా మొదలైయ్యింది. ఎద్దును తప్పించి యాక్సిలేటర్ మీద కాలు నొక్కాను. కారు వంద మీద పోతోంది. నవ్వు హోరు పెరిగింది. గుబులుగా, ఏడుపులా మొదలైన నవ్వు ఇప్పుడు చావుడప్పులా రిథమిక్‌గా, నాట్యం చేస్తున్నట్లూ... కాదు కాదు... పూనకం వచ్చి ఊగుతున్నట్లు... నాలుగు వైపులా నుండి వినిపిస్తున్నది. ఎంత వేగంగా వెళుతున్నా ఎద్దు ఎదురుగా కనబడుతూనే వుంది. సడన్‌బ్రేక్ వేశాను. కళ్లూ, చెవులు గట్టిగా మూసుకొని స్టీరింగ్ మీద వాలిపోయాను. గుండెల నిండా ఊపిరి పీల్చుకొని మెల్లిగా కళ్లు తెరిచాను. నవ్వు మాయమయ్యింది. ఎదురుగా ఎద్దు నిల్చోని ఉంది... ఈసారి సాధువులాగా మొహం ఏలాడేసుకొని... శాంతం నటిస్తూ... నా వేళ్లు స్టీరింగ్ మీద స్థిరపడ్డాయి. 'లెక్క చెయ్యను నిన్ను. పడి ఉండు అట్టాగే,' స్థిరంగా అనుకొన్నాను. ఎద్దును ఢీ కొట్టి నా కారు ముందుకి హుషారుగా కదిలింది.

*పాలపిట్ట మాసపత్రిక, జనవరి 2014*

